క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం


జక్కంపూడి రాజా

రాజానగరం: దివాన్ చెరువులోని ఎంఎఫ్ కన్వెన్షన్ హాలులో ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


చంద్రేడులో కొలువైన వేంకటేశ్వరస్వామి

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైయున్న పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా సత్తెమ్మతల్లి వార్షికోత్సవం


సత్తెమ్మతల్లి అమ్మవారు

రంగంపేట: మండల పరిధిలోని పెదరాయవరం గ్రామ శివారు ఏడీబీ రోడ్డు పక్కన కొలువైయున్న సత్తెమ్మతల్లి అమ్మవారి ఐదో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతి రూపాలైన గరగలను ప్రత్యేకంగా అలంకరించి జాగారం చేశారు. గ్రామస్తులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

పెదపూడి: మండలంలోని సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు శనివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా 14వ సప్తాహాలు


కాంద్రేగుల రామాలయంలో స్వామివారి సంకీర్తనలు ఆలపిస్తున్న భజన బృందం

పెదపూడి: మండలంలోని కాంద్రేగుల గ్రామంలోని కోదండ రామాలయంలో 14వ సప్తాహ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండల నలుమూలల నుంచి వచ్చిన భక్తభజన మండలి సభ్యులు శనివారం నాలుగో రోజు స్వామి వారి సంకీర్తనలు ఆలపించారు. వచ్చే నెల 3వ తేదీ వరకూ సప్తాహాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం


పెదపూడిలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామివారు

పెదపూడి: స్థానిక గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవం ఆదివారం ఉదయం 8.51 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సాధికారత కోఆర్డినేటర్ సింహాద్రి కనకాచారి, ఎస్ఐ పి.శోభనకుమార్ హాజరవుతారని చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

- ప్రభుత్వాసుపత్రుల్లో సరిపడా నిల్వలు
- ప్రతి శని, బుధవారాల్లో ఉచితంగా టీకాలు

బిక్కవోలు: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకూ ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపొచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరైన అవగాహన లేక టీకాలు వేయించుకోవడం లేదు. దీని వల్ల వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధినిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్‌లు వేసేది ఇలా

- గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలలు నిండిన తర్వాత ఒక టీటీ ఇంజెక్షన్, అనంతరం ఇంకో నెల రోజుల వ్యవధిలోనే మరో టీటీ ఇంజెక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్స్ ఇస్తారు.


పందలపాకలో చిన్నారులకు టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్-బీ డోసు వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చ కామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. 6, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి.
- 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటివల్ల కోరింత దగ్గు, కంఠ సర్పి, ధనుర్వాతం, మెదడు వాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్-ఏ చుక్కలు వేయించాలి. తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్-ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు ఇప్పించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజిల్స్, విటమిన్-ఏ ఓపీని వేయించాలి.
- ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి. 10, 16 సంవత్సరాలు పూర్తయితే టీటీ చేయించాలి.

టీకాలు తప్పనిసరి



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటివల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవొచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ విజయలక్ష్మి, వైద్యురాలు, కొంకుదురు పీహెచ్‌సీ

పరిశుభ్రతపై అవగాహన కల్పించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ వెంకటరత్నం

రంగంపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఈఓపీఆర్డీ వెంకటరత్నం సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, విద్యాశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వాటర్ ట్యాంకుల క్లీనింగ్, పైప్‌లైన్ల మరమ్మతులు చేయించాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగేలా అవగాహన కల్పించాలన్నారు. చేపలు, మాంసం విక్రయాలు నిషేధించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మండల వైద్యాధికారి వేణుశ్రీలక్ష్మి మాట్లాడుతూ ఏఎన్ఎంలు అందరూ గ్రామాల్లో సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిస్థితులు క్షుణ్ణంగా తెలుసుకోవాలని చెప్పారు. ఐసీడీఎస్ పీఓ జెస్సీఫ్లోరెన్స్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇచ్చే ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


పాలచర్ల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర

రాజానగరం: వర్షాలు కురుస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందికి క్షయ, కుష్ఠు, ఎయిడ్స్ కంట్రోల్ జిల్లా అధికారి డాక్టర్ వసుంధర ఆదేశించారు. మండలంలోని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కాచి వడగట్టిన నీటిని తాగడం, కుళాయి నీటిని తరచూ క్లోరినేషన్ చేయించడం ఎంతో అవసరమన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తూ, అవసరమైన వైద్య సహకారం అందించాలన్నారు. డయేరియా జ్వరాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీకి తెలియజేసేలా చూడాలన్నారు. ఈ నెల 18న ప్రారంభమైన లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) సర్వే ఆగస్టు 2వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. ప్రతి అనుమానిత చర్మ వ్యాధుల కేసును పీహెచ్‌సీకి రిఫర్ చేయాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు ఉదయ్ ఏంజెల్, ప్రధాన నర్సు మంగతాయారు, సూపర్‌వైజర్ ఎన్‌వీవీ రమణ, హెచ్‌వీ రత్నకుమారి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి


పందలపాకలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న పీఎంసీ చైర్మన్ నాగిరెడ్డి


బొబ్బిల్లంక హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ

బిక్కవోలు: బడి ఈడు పిల్లలందరినీ తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని ఎంపీడీఓ వి.విజయలక్ష్మి అన్నారు. శనివారం బిక్కవోలు ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు నిరక్షరాస్యులుగా మిగలకుండా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.కన్యాకుమారి, ఎంఈవో కె.పూర్ణచంద్రరావు, హెచ్‌ఎం పల్లా వీర ప్రభాకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పందలపాకలో శ్రీపడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నేను బడికి పోతా అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి మాట్లాడుతూ తమ పిల్లలు ఎంత బాగా చదువుకుంటే తల్లిదండ్రులకు అంత ఆనందమన్నారు. చిన్నారులందరినీ బడిలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' ర్యాలీ

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం నేను బడికి పోతా కార్యక్రమం, అవగాహన ర్యాలీని ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై నినాదాలు చేశారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలని ప్లకార్డులు ప్రదర్శించారు.


బిక్కవోలులో నేను బడికి పోతా కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు

జీఎస్ఎల్‌లో మరో నెల పాటు ఉచిత వైద్యం

రాజానగరం: జీఎస్ఎల్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రిలో నెల రోజులుగా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను మరో నెల పాటు కొనసాగించాలని నిర్ణయించామని ఆస్పత్రి చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. డాక్టర్ డే అయిన జూలై ఒకటిన వైద్య కళాశాలను ప్రారంభించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రోగులకు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. ఈ నెల రోజులు అందించిన విధంగానే అన్ని రకాల చికిత్సలు, మెడికల్ ప్రొసీజర్లు, సర్జరీలు మరో నెల రోజులు ఉచితంగా చేస్తామన్నారు. అయితే వైద్య పరీక్షలు, ఇన్వెస్టిగేషన్లకు సంబంధించిన ఫీజులలో మాత్రం 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో చేసే వైద్య సేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల జీఎస్ఎల్ అమ్మ భోజనం పథకంలో రూ.10 కే భోజనాన్ని అందిస్తామన్నారు. 20వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు సోమవారం రానున్న ముఖ్యఅతిథి, ప్రముఖ రేడియోషన్ ఆంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. అదే రోజు రాజమహేంద్రవరంలోని కేన్సర్ ఆస్పత్రిలో హార్మోని యూనిట్‌ని కూడా ఆయన ప్రారంభిస్తారని డాక్టర్ భాస్కరరావు తెలిపారు.

సేవలతోనే ప్రజలలో గుర్తింపు


ఎంఈవో ముత్యాలు దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న డీఎస్ఈవో వాసుదేవరావు తదితరులు

సీతానగరం: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ప్రజలలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంఈవో - 2 తాతిపూడి ముత్యాలు ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ముత్యాలు, మహాలక్ష్మి దంపతులను ఎమ్మెల్యే బలరామకృష్ణ, డీఎస్ఈవో వాసుదేవరావు, డీవైఈవో నారాయణ, ఇతర ఎంఈవోలు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కుశలవదొర, రామన్న దొర, బి.దిలీప్ కుమార్, దాసు పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయలతో సంపూర్ణ ఆరోగ్యం


ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వీజీఎస్ఆర్ నాయుడు

రాజానగరం: సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు, పండ్లను తీసుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకుంటూ, ఆరోగ్యంగా ఉండవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీజీఎస్ఆర్ నాయుడు అన్నారు. కూరగాయల సాగులో సేంద్రియ ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయంపై కలవచర్లలోని కేవీకేలో శనివారం జిల్లా ఆత్మ ప్రాజెక్టు సహకారంతో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఏపీ కమ్యూనిటీ బేస్డ్ నేచురల్ ఫామింగ్ సహకారంతో ప్రకృతి వ్యవసాయంలో వరి పంటతో పాటు కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిరి కూరగాయలు, వంగ, బెండ, గోరుచిక్కుడు, బీట్రూట్, క్యారెట్, ఆకుకూరలు వంటి వాటిని దాదాపు 20 సెంట్ల విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా చేపట్టారు. శిక్షణలో పాల్గొన్న వారికి వీటిని చూపిస్తూ, సాగులో అనుమానాలను నివృత్తి చేశారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వై.జ్యోతిర్మయి మాట్లాడుతూ సేంద్రియ కూరగాయలను, ఆకుకూరలతో ఆరోగ్యపరంగానే కాకుండా, వాటిని విక్రయించడం ద్వారా ఆర్థిక ప్రయోజనాలను కూడా అందుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే ఉద్యాన పంటల అధికారి జీవీఆర్ సత్యవాణి, ఏపీసీఎన్ఎఫ్ సభ్యుడు ఎ.వెంకట్రావు, వ్యవసాయశాఖ, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో ఆర్థిక ప్రగతి


చిరుధాన్యాల సాగుపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజానగరం: సజ్జలు, రాగులు, జొన్నలు, కొర్రలు వంటి చిరు ధాన్యాలను సాగు చేసి విక్రయించడం ద్వారా ఆర్థిక ప్రగతి సాధించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు అన్నారు. కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో 'చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు' అనే అంశంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చిరుధాన్యాల సాగును విస్తృతంగా చేపట్టామన్నారు. పండిన తరువాత ఈ ఉత్పత్తులను వివిధ రకాలుగా మలచి, మార్కెటింగ్ చేస్తే మంచి లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీజీఎస్ఆర్ నాయుడు మాట్లాడుతూ గత ఏడాది 1500 హెక్టార్లలో చిరుధాన్యాలను సాగు చేశారని, మార్కెటింగ్ కూడా బాగా జరిగిందన్నారు. చిరుధాన్యాల వల్ల ఆరోగ్యపరంగా, ఆర్థికంగా కూడా ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల సాగుపై తయారు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ప్రొఫెసర్ డెబోరా మెస్సియానా, జిల్లా ఆత్మ పీడీ డాక్టర్ వై.జ్యోతిర్మయి, డీఆర్సీ ఏడీఏ జయరామలక్ష్మి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ ఎస్.హైమజ్యోతి, అభ్యుదయ రైతులు ప్రసాదరెడ్డి, వెంకటేశ్వరరావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

హెచ్‌ఎం భాస్కరరావు సేవలు అభినందనీయం


హెచ్‌ఎం భాస్కరరావు దంపతులను సన్మానిస్తున్న ప్రముఖులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ఎంపీపీ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బొల్లా ప్రగడ భాస్కరరావును చేసిన సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఉద్యోగ విరమణ చేస్తున్న భాస్కరరావు అభినందన సభను శనివారం సీతానగరం బస్టాండ్ సెంటర్ సమీపంలోని రాజుగారి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం భాస్కరరావు, జ్యోతి దంపతులను ఉపాధ్యాయులతో పాటు ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, మాజీ ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు (తోటలో రాజు), పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీమణి, మండల అధ్యక్షుడు జీఎల్ సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ ఆర్.పాపారావు, వైవీ నరసింహం, బొబ్బిల్లి సత్యనారాయణ తదితరులు సత్కరించారు.

నోట్ పుస్తకాల వితరణ


బొబ్బిల్లంక హైస్కూల్లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఎస్ఈవో వాసుదేవరావు

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శనివారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు హేమంత్ కుమార్ దంపతులు రూ.15 వేలతో సమకూర్చిన ఈ పుస్తకాలను జిల్లా స్కూల్ విద్యాశాఖాధికారి వాసుదేవరావు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ముందుకొచ్చి విద్యార్థులకు ఇలాంటి సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సత్యనారాయణ, ఉపాధ్యాయులు సుందరరావు, వీరబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం


ప్రత్యేక అలంకరణలో సంతాన వేణుగోపాలస్వామి

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో కొలువైన రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయం వద్ద అర్చకులు వింజరపు రామచంద్ర ప్రసాద్, ఖండవిల్లి శ్రీనివాస్ ఆచార్యులు ఆధ్వర్యంలో శనివారం స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన పి.బాబురావు, లక్ష్మీతులసి దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. నందిని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొవ్వూరి వెంకటరెడ్డి, సర్పంచ్ సీతారత్నం దంపతులు స్వామివారి ఫొటోలను భక్తులకు అందించారు. అనంతరం అన్న సమారాధన చేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పడాల రాము, పందలపాక సర్పంచ్ సబ్బారపు పద్మావతి, మేడపాటి దుర్గారెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి పింఛన్ల పంపిణీ


హేమ సుందరరావు, ఎంపీడీవో

మధురపూడి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం నుంచి జరుగుతుందని కోరుకొండ ఎంపీడీఓ హేమ సుందరరావు అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 12,474 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.8.44 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్టు తెలిపారు.

4న వాహనాలకు వేలం

మధురపూడి: వివిధ కేసులలో పట్టుబడి, కోరుకొండ సెబ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఉన్న వాహనాలకు జూలై 4వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సీఐ బంగారు రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. కాపవరంలోని సెబ్ సీఐ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి వేలం ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి కలవారు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో వేలంలో పాల్గొనాలన్నారు.

వైభవంగా దుర్గాలమ్మ జాతర

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామ దేవత దుర్గాలమ్మ జాతరను గ్రామపెద్దల ఆధ్వర్యంలో శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు పుష్కర కాలానికి ఒకసారి జరిగే ఈ మహోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, ఆయన అల్లుడు, హాస్య నటుడు భద్రం, కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ అమ్మవార్ల జాతరలు కుటుంబ ఐక్యమత్యానికి, గ్రామాభివృద్ధికి నిదర్శమన్నారు. కార్యక్రమంలో గంగిన పెద్దబ్బులు, గంగిన నాగేశ్వరరావు, కొల్లి వెంకట్రావు, యానాపు ఏసు, బీవీ రామారావు, సోము కృష్ణ, సోము గాంధీ పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరికి రిమాండ్

సీతానగరం: రఘుదేవపురం వడ్డీరపేటకు చెందిన యాంద్ర సూర్యకాంతం, యాంద్ర వెంకట రమణకు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై టి.రామకృష్ణ శనివారం తెలిపారు. స్పెషల్ టీమ్‌తో వడ్డీర పేటలో జల్లెడ పట్టామని, సారా విక్రయిస్తున్న సూర్యకాంతం నుంచి 15 లీటర్లు, వెంకట రమణ నుంచి 10 లీటర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారన్నారు.

ఎస్‌కేఆర్ విద్యార్థినుల ప్రతిభ

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థినులు ఏపీ సెట్‌లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి శనివారం తెలిపారు. ఎస్.సాత్విక, కె.శిరీష, పి.రూపశ్రీ, కె.జ్యోతిశ్రీ, టి.హర్షిత, స్రవంతి, రామకృష్ణ, మెర్సీగోల్డ్, ప్రసన్న, రమ్యశ్రీ, మనీషా, అనూష అంజలి, దీపిక, స్రవంతి, నాగజ్యోతి, ఆర్ఎస్.శ్రీనివాసరావు, రూపశ్రీ, మమత, మౌనిక సాహో ఆలియా ర్యాంకులు సాధించారన్నారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.